ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

మంగళవారం, 9 జూలై 2024





	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24	37
భద్రాద్రి	26	32



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఇక నామినేటెడ్ పదవులపై అధిష్ఠానం దృష్టి సారించింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు పదవులకు ఎంపిక చేసినప్పటికీ అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చే విషయంలో ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో అధికారిక నియామకానికి బ్రేక్‌పడింది. కాగా సోమవారం రాష్ట్రంలో పలు కార్పొరేషన్ చైర్మన్ పదవులకు గతంలో ఎన్నిక చేసిన వారికే చైర్మన్ పదవులు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆ నలుగురికే పదవులు దక్కాయి.

- రాష్ట్ర అటవీ సంస్థ చైర్మన్‌గా పోదెం వీరయ్య..
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు
- రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నాయుడు సత్యనారాయణ
- రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు
- అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మంత్రి తుమ్మల, రేణుక వర్గాలకు మొండిచేయి
- మలివిడత భర్తీలో పదవులు దక్కుతాయని ప్రచారం

'నామినేటెడ్' కళ

ఉమ్మడి జిల్లాకు దక్కిన నాలుగు రాష్ట్ర స్థాయి పదవులు

ఖమ్మం, జూలై 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు రాష్ట్ర అటవీ సంస్థ చైర్మన్ పదవి వరించింది. గత ఎన్నికల్లో ఆయన భద్రాచలం నుంచి పోటీచేసి ఓడిపోగా అక్కడ బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసి గెలిచిన తెల్లం వెంకటరావు కాంగ్రెస్‌లో చేరారు. వెంకటరావు చేరికకు వీరయ్య మొదట్లో అభ్యంతరం వ్యక్తంచేసినా ఆయనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని హామీ ఇచ్చి నియమించింది.

కాగా ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రాయల నాగేశ్వరరావు పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రత్నించారు. రాష్ట్ర పీసీసీ కమిటీ సభ్యుడూ అయిన రాయల గతంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి ఓటమి చెందారు. పాలేరు కాంగ్రెస్ టికెట్‌కోసం ప్రయత్నించినా దక్కలేదు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ టికెట్ ఆశించి చివరి వరకు రేసులో నిలిచారు. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం అసెంబ్లీ ఎన్నికల తరుణంలోనే పొంగులేటి శ్రీనివాసరెడ్డికి టికెట్ ఇవ్వడతో ఆయన కు కార్పొరేషన్‌పదవి హామి ఇచ్చింది. ఈ హామీలో భాగంగా తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవిలో నియమించారు.

వైరాకు చెందిన నాయుడు సత్యనారాయణ తెలంగాణ రాష్ట్ర హస్తకళ అభివృద్ధి చైర్మన్‌పదవి వరించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనుచరుడుగా ఉన్న సత్యనారాయణ భట్టి పాదయాత్రలో కీలకంగా పనిచేశారు. దీంతో భట్టి సిఫార్సుతో హస్తకళ అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి లభించింది. అలాగే రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅనుచరుడుగా ఉన్న మువ్వా విజయ్‌బాబుకు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌పదవి వరించంది. విజయ్‌బాబు గత అసెంబ్లీ ఎన్నికల్లో పొంగులేటి వర్గం నుంచి టికెట్ కోసం ప్రయత్నించారు. దీంతో ఆయనకు పొంగులేటి సిఫార్సుతో నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి వరించింది. గతంలో ఆయన ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు.



ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కార్పొరేషన్ పదవులల్లో నాలుగు దక్కాయి. అయితే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రమాజీమంత్రి , రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరీ వర్గీయులకు ప్రస్తుత నియామకాల్లో అవకాశం దక్కలేదు. మలివిడత నియామకాల్లో తుమ్మల, రేణుక వర్గీయులకు కార్పొరేషన్ పదవులు దక్కే అవకాశం ఉంది. దీంతో మరికొన్ని కార్పొరేషన్ పదవులు దక్కుతాయన్న ప్రచారం జరుగుతోంది. జిల్లాలో కీలకమైన భద్రాచలం దేవస్థానం చైర్మన్ పదవి, ఖమ్మంలోని స్తంభాద్రి డెవలప్‌మెంట్ అథారిటీ పదవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి, రాష్ట్ర స్థాయిలో మరికొన్ని చైర్మన్ పదవులు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు ఆశిస్తున్నారు. మలివిడత నియామకాలు ఈవారంలోనే ఉండే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మరికొందరు ఆశాపరులతో పాటు కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న సీనియర్లు, ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి చేరిన మరికొందరు ముఖ్యనేతలు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. ఎవరికివారు పదవులు దక్కించుకునేందుకు గట్టి లాబీయింగ్ నడిపిస్తున్నారు.

అడవులను అభివృద్ధి చేసి చూపిస్తా

- పోడు భూముల సమస్య పరిష్కారానికి కృషి
- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

పంటలకు గిట్టుబాటు ధరకు కృషి

- రాష్ట్రంలో అవసరమైన చోట గిడ్డంగుల నిర్మాణం
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

సాగునీటి కల్పనకు కృషి..

- పంటలు పుష్కలంగా పండేలా నీటి వసతి
- రాష్ట్ర నీటిపారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్‌బాబు

హస్తకళలను ప్రోత్సహిస్తాం..

- స్వయం సహాయక మహిళలకు ప్రాధాన్యం
- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ

7



ఏన్కూరు లింక్ కెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

వడివడిగా 'సీతారామ' పనులు

- ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణానికి తొలగిన అడ్డంకులు
- ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డిచే నీటి విడుదల
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏన్కూరు, జూలై 8: సీతారామ ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణ పనులకు అన్ని అడ్డంకులు తొలిగిపోయాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయన్నారు. గత నెల 25న ఓ పంప్‌హౌస్ ట్రయల్ రన్ నిర్వహించగా వేగంగా కాలువ పనులు పూర్తిచేసి ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలోని హిమాంనగర్, రేపల్లెవాడ గ్రామాల మధ్య జరుగుతున్న కాలవ పనులను సోమవారం పరిశీలించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గుజరాత్ చీఫ్ సెక్రటరీతో మాట్లాడి పనులకు అడ్డంకిగా ఉన్న గ్యాస్‌పైపులైన్‌కు పర్మిషన్ తెప్పించడంతో లిక్‌కెనాల్ పనులకు ఆటంకం తొలిగిందన్నారు సీతారామ ప్రధాన కాలవ బీజీ కొత్తూరు, కమలాపురం, పూసుగూడెం పంప్‌హౌస్‌ల ట్రయల్‌రన్ పనుల కోసం చైనా నుంచి సాంకేతిక నిపుణులను రప్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే వేగంగా నిర్మాణం జరిగే అతిపెద్ద ప్రాజెక్టు సీతారామ అని తెలిపారు. కేవలం 100ఎకరాలు కోల్పోయి లక్షా 20వేల ఎకరాలకు సాగునీరు అందించే ఏకైక ప్రాజెక్టుగా ఇది నిలవనుందన్నారు. సీతారామ లింక్‌కెనాల్‌కు సంబంధించి 16బ్రిడ్జీలు, కల్వర్టులు, నిర్మాణం పూర్తికావవస్తోందన్నారు. త్వరలోనే కాలవ నిర్మాణ పనులు పూర్తవుతాయని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు అన్యాయం జరగకుండా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, రమేస్‌రెడ్డి, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, డీఈ చంద్రశేఖర్, కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు మేడా ధర్మారావు, శోభన్‌నాయక్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, పూర్ణకంటి మైసారావు పాల్గొన్నారు.

రేపు సింగరేణి హెడ్డాఫీస్ ముట్టడి

- కేంద్రం బొగ్గుబ్లాక్‌ల వేలాన్ని విరమించుకోవాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల జేఏసీ నేతలు

కొత్తగూడెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోడీ సర్కార్ బొగ్గు బ్లాక్‌లను వేలం వేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని నిర్వహిస్తున్న దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా 10వతేదీన సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు కార్మికసంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. కొత్తగూడెంలోని ఏఐటీయసీ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో సోమవారం జరిగిన వామపక్షాల అనుబంధ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ సంఘాల ముఖ్య నాయకులతో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు వంగ వెంకట్, కంచర్ల జమలయ్య, జి. వీరస్వామి, బ్రహ్మచారి, రాజారావు, భూక్యా రమేష్, చంద్రశేఖర్‌లు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం జాతి సంపదను ప్రైవేట్ కంపెనీలకు దోచి పెట్టేచర్యలకు పూనుకుంటోందని ఆరోపించారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం వేసి ఆ తర్వాత ఇతర బ్లాక్‌లను ప్రైవేట్‌కు అప్పగించి సింగరేణి సింస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతుందన్నారు. ఈ చర్యలను ప్రజా, కార్మిక ఉద్యమాల ద్వారా తిప్పికొట్టి సింగరేణి సంస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 10వ తేదీన సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడికి పార్టీలు, సంఘాల కతీతంగా అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు గెద్దాడు నగేష్, జే. గట్టయ్య, సీఐటీయూ నాయకులు రాజారావు, భూక్య రమేష్, వైవి. రావు, ప్రశాంత్, అలి తదితరులు పాల్గొన్నారు.



వరద నీటితో కిన్నెరసాని ప్రాజెక్టుకు జలకళ

కిన్నెరసానికి పెరిగిన వరద

- 398.50 అడుగులకు చేరిన ప్రాజెక్టు నీటిమట్టం

పాల్వంచ రూరల్, జూలై 8: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ నుంచి వరదనీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం 398.50 అడుగులకు పెరిగింది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలవల్ల పాకాల, కొత్తగూడెం, గుండాల, ఇల్లెందు, టేకులపల్లి నుంచి వరదనీరు కిన్నెరసానికి చేరుతోంది. రెండురోజుల క్రితం 395 అడుగులుగా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం వరద పెరగడంతో 398.50 అడుగులకు చేరింది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 407అడుగులుకాగా ప్రస్తుతం 398.50 అడుగులకు చేరడంతో డ్యాం అధికారులు అప్రమత్తమయ్యారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

- భూ సంబంధిత సమస్యలపైనే ఎక్కువ దరఖాస్తులు
- సదరం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని వినతి
- అర్జీలను స్వయంగా స్వీకరించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'లో వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రజల నుంచి స్వయంగా దరఖాస్తులు స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలపైనే ప్రజలు ఎక్కువగా ఫిర్యాదులు అందించారు. ధరణి పోర్టల్‌లో సర్వే నెంబర్ల తప్పులను సవరించాలని విన్నవించారు. ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని విన్నవించారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ధరణి సంబంధిత సమస్యల పరష్కారానికి కృషి చేస్తున్న క్రమంలో... 'ప్రజావాణి' కార్యక్రమంలో ధరణి సమస్యలపైనే ఎక్కువగా దరఖాస్తులు వస్తుండటం గమనార్హం.

- ఖమ్మం కలెక్టరేట్

6

ప్రకృతి పండుగ సీత్లా

- గిరిజనులకు అత్యంత ప్రీతిపాత్రమైన వేడుక
- గుబాళించనున్న బంజారాల సంస్కృతీ సంప్రదాయాలు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని, పశుపక్ష్యాదులు సుబిక్షంగా ఉండాలని పూజలు
- నేడు ఘనంగా జరుపుకొనేందుకు బంజారాలు సంసిద్ధం

ఖమ్మం సాంస్కృతికం/ఎర్రుపాలెం, జూలై 8: సీత్లానాయక్ పండుగ... గిరిజన తండాలకు తొలి అతి పెద్ద పండుగ.. ఆషాఢమాసం, పెద్దపుశాల కార్తె, అందరికీ వర్షాకాలం.. కానీ లంబాడీ గిరిజన సోదరులకు మాత్రం కార్తెలో వచ్చే తొలిమంగళవారం తమ సంప్రదాయ పండుగ. ఆషాఢమాసం సమీపిస్తూనే తండాల్లో సీత్లా భవానీ పండుగ సందడి మొదలవుతుంది.. ఉమ్మడి జిల్లా గిరిజన మండలాలకు, తండాలకు, తెగల సంస్కృతి, సంప్రదాయాలకు బలమైన కేంద్రం కావటంతో సీత్లా పండుగ కళతో తండాల్లో ఆనందం చోటు చేసుకుంటుంది.. సీత్లా పండుగగా వాడుకలో పిలిచే ఈ పండుగను లంబాడీల పశు పక్ష్యాదులు, పంట పొలాలు పండుగను స్వాగతిస్తుంటాయి.. పండుగ మనుషులకే కాదు ప్రకృతితో కూడా ముడిపడి ఉండటం ఇందుకు కారణం.. తమ సంప్రదాయ వస్త్రాలు, గాజులు, తలపాగాలు తదితర కట్టుబొట్టును పాటిస్తూ పాటలు పాడుతూ పండుగలో పాల్గొంటారు. ఆడపడుచులు, యువతీయువకుల సంప్రదాయ సందడి ఈ పండుగలో అధికంగా కనిపిస్తుంది. సీత్లా భవానీకి మొక్కులు చెల్లించటం, సంస్కృతిని, సంప్రదాయాన్ని భావితరాలకు అందించే క్రతువు వారిద్వారానే జరుగుతుంది...



ఏటా పెద్ద పుశాల కార్తెలో..

సీత్లా పండుగను ప్రతి ఏటా ఆషాఢమాసంలో వచ్చే పెద్ద పుశాల కార్తెలో తొలి మంగళవారంతో మొదలవుతుంది.. తమ గ్రామ పొలిమేర దేవతైన సీత్లా భవానీ విగ్రహాలకు తండాలోని గిరిజనులందరూ సామూహికంగా మొక్కులు (మిగతా 6వ పేజీలో)



వైఎస్‌ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రఘురాం రెడ్డి

వైఎస్‌కు ఘన నివాళి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 8: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి నివాళులు అర్పించారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా సోమవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆగస్టు 15 నాటికి రుణమాఫీ

- సాగుచేసే భూములకే రైతు భరోసా
- గత ప్రభుత్వ హయాంలో రూ.25 వేల కోట్ల దుర్వినియోగం
- త్వరలో పామాయిల్ ఫ్యాక్టరీ పనుల ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

7



7

భూమి పోయింది.. పరిహారం ఏమైంది?

- కాళ్లరిగేలా తిరుగుతున్న కనికరించడం లేదు..
- ఎంతకీ నోరు మెదపని అధికారులు
- గగ్గోలు పెడుతున్న బీటీపీఎస్ నిర్వాసితులు

వరదల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

- విస్తాకాంప్లెక్సు వద్ద పరిస్థితుల పరిశీలన
- పర్ణశాల సబ్ స్టేషన్ పనులు ప్రారంభించాలి
- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

భద్రాచలం/దుమ్ముగూడెం, జూలై 8: రాబోయే వర్షాకాలంలో వరదల సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో పర్యటించారు. ఈ సమయంలో రాబోయే వర్షాకాలంలో విద్యుత్తు సమస్యలు ఎలా అధికమించాలి, చేపట్టాల్సిన చర్యలపై ఎన్పీడీసీఎల్ భద్రాచలం డివిజన్ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. భద్రాచలం వచ్చిన సీఎండీ ముందుగా విస్తాకాంప్లెక్స్ వద్ద ఉన్న పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. గోదావరి వరదల సమయంలో పట్టణంలోని వ్యర్ధ నీరు, ఇతరత్రా నీటిని గోదావరిలో లిఫ్ట్ చేసేందుకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటిని గోదావరిలోకి లిఫ్ట్ చేసేందుకు సరిపడ విద్యుత్ అందుతోందా అని నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎలాంటి విపత్ అయినా ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. ఇందుకోసం అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. 70 అడుగుల నీటిమట్టం భద్రాచలం వద్ద వచ్చినా విద్యుత్ సరఫరాలో ఏ మాత్రం అంతరాయం రాకుండా చూడాలని స్పష్టం చేశారు. సీఎండీ రాక సందర్భంగా వన మహోత్సవంలో భాగంగా డీఈ కార్యాలయంలో మొక్కలు నాటారు. అంతకు ముందు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా 2022 వరదల్లో ఏ విధంగా విద్యుత్తు అధికారులు పని చేసింది సీఎండీకి స్థానిక ఇంజనీరింగు అధికారులు వివరించారు.

పర్ణశాల సబ్ స్టేషన్ పనులు వెంటనే ప్రారంభించాలి

ఎన్పీడీసీఎల్ భద్రాచలం డివిజన్ పరిధిలో పర్ణశాల విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించిన సీఎండీ వరుణ్‌రెడ్డి తరచూ సబ్ స్టేషన్ మునిగిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పర్ణశాల సబ్ స్టేషన్‌ను వెంటనే సురక్షిత ప్రాంతంలో నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఇందుకు రెవెన్యూ అధికారులు స్థలం వెంటనే చూపించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి వెంటనే టెండర్లు పిలిచి కాంపౌండ్ వాల్ పనులను సత్వరమే చేపట్టాలన్నారు. 24 గంటలు సిబ్బంది అప్రమత్తంగా ఉండి భద్రాద్రి ఏజెన్సీవాసులకు నిరంతర విద్యుత్తు సరఫరా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ బీకామ్‌సింగ్, డీఈలు జీవన్‌కుమార్, నందయ్య, ఏడీఈలు, ఏఈలు, నీటిపారుదల శాఖ ఈఈ రాంప్రసాద్, భద్రాచలం దుమ్ముగూడెం రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చిర్రకుంట చెరువుకు గండి

- వృథాగా పోతున్న నీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు


చిర్రకుంట చెరువుకు గండిపడిన దృశ్యం, గండిని పరిశీలిస్తున్న రైతులు

కరకగూడెం, జూలై 8: మండలంలోని పలు చెరువులు మరమ్మతులకు వచ్చి ఏళ్లు గడుస్తున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకునే వారే కరువయ్యారు. మండలంలోని చిరుమళ్ళ పంచాయతీ రాయణపేట గ్రామ పరిధిలోని చిర్రకుంట చెరువు మరమ్మతులకు వచ్చి సుమారు మూడు సంవత్సరాలు గడుస్తుంది. సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపన లేరు. గతంలో చెరువు పనులు చేసిన కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతో చెరువు అలుగు పూర్తిగా కుంగిపోయంది. దాంతో రైతుల పంటలకు సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి చిర్రకుంట చెరువుకు భారీ గండి పడింది. దాంతో చెరువులో నీరు వృథాగా పోతున్నాయి. చెరువులో నీరు లేకుండా పోతే పంటలు వేసిన ఎండిపోక తప్పదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చెరువు మరమ్మత్తులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం అవుతున్న వైనం..

మండలంలోని తుమ్మలగూడెం చెరువు రెండు సంవత్సరాల క్రితం తెగిపోయింది. పద్మాపురం పంచాయతీలోని చెరువుకు అలుగు వద్ద ప్రమాదకరంగా మారింది. రాయణపేట చెరువు వండిపడింది. అంతేకాక మండలంలోని పలు చెరువులు ప్రమాదపు అంచున ఉన్నాయని రైతులు వాపోతున్నారు. మండలంలోని పలు చెరువులు తెగి రైతులకు ఇబ్బందులు పడుతున్నప్పటికి ఇరిగేషన్ అధికారులు మాత్రం ప్రతిపదనలకు పంపించాము రాగానే పనులు మొదలు పెడతామని చెప్పుతూ.. చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చెరువులకు మరమ్మతులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాయణపేట చిర్రకుంట చెరువుకు గండిపడి చెరువులో నీరు వృథాగా పోతున్న విషయంపై ఆంధ్రజ్యోతి ఇరిగేషన్ ఏఈ సక్రుకు ఫోన్ ద్వారా సంప్రదించగా ఫోన్‌కు స్పందించలేదు.

అధికారుల నిర్లక్ష్యం

కొమరం మల్లయ్య రాయణపేట రైతు



సుమారు మూడు సంవత్సరాలుగా చెరువు మరమ్మతులకు వచ్చిం ది. సమస్యను అధికారుల దృష్టికి తెలిపినప్పుడు మాత్రమే వస్తారు. తరువాత ఇటువైపు చూడరు. అధికారుల నిర్లక్ష్యం వలనే సమస్య కొలిక్కి రావడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలి.

చెరువు పూర్తిగా తెగిపోతుంది

అలెం జగపతి, రాయణపేట రైతు



గత కొన్ని సంవత్సరాలుగా చిర్రకుంట చెరువు ప్రమాదకరంగా ఉంది. అధికారులు ఇటువైపు రారు. వస్తే ఇదిగో అవుతుంది అదిగో అవుతుందని మాటలు జారపేడుతున్నారు. ఇప్పుడు కురిసే వర్షాలకు చెరువుకు పెద్ద గండి పడింది. ఇంకా ఇలానే ఉంటే చెరువు పూర్తిగా తెగిపోతుంది. అధికారులు స్పందించాలి.

రేపు ఉమ్మడి జిల్లా జేఎల్‌ఎం ఎంపిక పరీక్షలు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 8: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జూనియర్ లైన్ మెన్ (జేఎల్‌ఎం) ఉద్యోగ నియామకాల కోసం అర్హత కలిగిన అభ్యర్థులకు ఈనెల 10న స్థంభం ఎక్కే పరీక్షలు నిర్వహిస్తామని విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీరింగ్ అధికారి సురేందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాలను ఇప్పటికే పోస్టు ద్వారా అభ్యర్థులకు పంపామన్నారు. 8వ జాబితాలను నోటీస్‌బోర్డులో ప్రదర్శనకు ఉంచామన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు

- ఆర్ఎం సరిరాం
- ఖమ్మం, భద్రాచలం నుంచి సర్వీసులు

ఖమ్మం ఖానాపురంహవేలి/భద్రాచలం జూలై 8: ఈ నెల 21న గురుపౌర్ణమి రోజున అత్యంత వైభవంగా జరగబోవు అరుణాచలగిరి ప్రదక్షణకు టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని రీజనల్ మేనేజర్ అజ్మీరా సరిరాం తెలిపారు. ఖమ్మం, భద్రాచలం డిపోల నుంచి సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసి రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. ఖమ్మం నుంచి బస్సు 19న రాత్రి 7 గంటలకు, భద్రాచలం నుంచి 19వ తేదీ రాత్రి 8గంటలకు బయలుదేరుతుందన్నా రు. 20 వతేదీ రాత్రికి అరుణాచరలం చేరుకుంటుందన్నారు. మధ్యలో విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ సందర్శన ఉంటుందన్నారు. తిరుగు ప్రయాణం 21వ తేదీ రాత్రికి బయలుదేరి 22న గమ్య స్థానాలకు చేరుకుంటాయని తెలిపారు. ఖమ్మం నుంచి పెద్దలకు రూ.4190, భద్రాచలం నుంచి ఒక్కొరికి చార్జీ రు. 4వేలుగా చార్జి వసూలు చేస్తారన్నారు. ఆసక్తి గత భక్తులు ఆర్టీసీ బస్సుల కొరకు రిజర్వేషన్‌లు చేసుకోవాలని కోరారు. ఖమ్మం డిపో మేనేజర్ నెంబర్ 9959225958, భద్రాచలం డిపో మేనేజర్ నెంబర్ 9959225960 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

డీడీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం

- వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి బృందాలకు శిక్షణ
- సింగభూపాలెం చెరువులో డెమో నిర్వహణ
- ప్రత్యక్షంగా వీక్షించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

సుజాతనగర్, జూలై 8: వరదలలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న బాధితులను రక్షించడానికి డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీడీఆర్‌ఎఫ్) బృందాలను సిద్ధం చేశామని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సోమవారం సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువులో డీడీఆర్‌ఎఫ్ బృందం చేసిన రెస్క్యూ ఆపరేషన్ డెమోని ఆయన స్వయంగా తిలకించారు. ప్రమాదవ శాత్తు చెరువులో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించే విధానాన్ని స్వయంగా ఎస్పీ బోటులో ప్రయాణించి వీక్షించారు. ఈ బృందంలోని సభ్యులు చేసిన ప్రదర్శనను తిలకించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. డీడీఆర్‌ఎఫ్ బృందానికి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆర్ఎస్ఐ సుమంత్ రెస్క్యూ ప్రక్రియ మొత్తాన్ని ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాబోయే వర్షాల దృష్ట్యా జిల్లాలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన డీడీఆర్‌ఎఫ్ బృందం సిద్ధంగా ఉందన్నారు. మొత్తం 20 మంది సభ్యులతో ఈ డీడీఆర్‌ఎఫ్ బృందాన్ని సిద్ధంగా ఉంచామన్నారు. ముఖ్యంగా గోదావరి నది వరదలు సంభవించినపుడు నదీ పరిసర ప్రాంతాలలో నివసించే లోతట్టు ప్రజలను సంరక్షించడానికి ఈ బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. రెస్క్యూ సమయంలో అవసర మయ్యే లైవ్ జాకెట్స్, లైఫ్ బాయ్ రింగ్స్, బోట్ పెడల్స్, రోప్స్, ఇతర సామాగ్రిని వారికి సమకూర్చడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఆర్ఐ రవి, సుజాతనగర్ ఎస్సై జుబేదా బేగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించిన

కేటీపీఎస్ ఉన్నతాధికారులు

● సమాచారం ఇచ్చేందుకు నిరాకరణ

మణుగూరు, జూలై 8: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో గత నెలలో కాలిపోయిన యూనిట్ వన్ జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్ పై పోస్టుమార్టమ్ జరుగుతోంది. కాగా ఈ నెల మొదటి సోమవారం బీహెచ్ఈఎల్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగిన విషయంపై ఆరా తీసి హైదరాబాద్‌లోని జెన్కో ఉన్నతాధికారులకు సమాచారం నివేధిక రూపంలో అందజేశారు. అయితే సోమవారం జెన్కో అధికారులు కూడా ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు ఎలా అంటుకున్నాయి. అన్న విషయంపై ఆరా తీసేందుకు వచ్చినట్లు సమాచారం. అయితే జెన్కోకు సంబంధించి కేటీపీఎస్ నుంచి సీఈ పీవీ రావు, ఓ ఎస్ఈలు ఇద్దరు, ఓడీఈ అధికార బృందం మణుగూరు చేరుకుని బీటీపీఎస్‌లో జరిగిన ప్రమాదం ట్రాన్స్‌ఫార్మర్‌కు వాటిల్లిన నష్టం ఇందుకు గల కారణాలను పరిశీలించే పనుల్లో నిమగ్నమైనట్లు తెలిసింది. ఈ విషయంపై స్థానిక అధికారులను ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ప్రయత్నించగా వారు సమాచారం ఇచ్చేందుకు నిరాకరించారు. యూనిట్ వన్ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను స్టెట్ అప్ చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేసే ఈ జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా పాడైపోయిందా లేదా స్వల్పంగా పాడైందా ఏ కారణాల వల్ల ప్రమాదం జరిగింది అన్న విషయాలను ఇప్పటికైనా జెన్కో అధికారులు బహిర్గతం చేయకుండా గోప్యంగా వ్యవహారించడం అనుమానాలకు పలు అనుమానాలకు తావిస్తోంది. కేటీపీఎస్ అధికార బృందమైనా పూర్తి పరిశీలనల అనంతరం సమాచారం వెల్లడిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించండి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసినకార్మికసంఘాల నాయకులు


మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెం, జూలై 8: కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి కిషన్ రెడ్డిని హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సోమవారం కలిసి తెలంగాణ ప్రాంతంలో ఉన్న బొగ్గుగనులను సెక్షన్ 11ఎ/17(ఎ) ఎంఎండీఆర్ 1957 ప్రకారం సింగరేణికే కేటాయించాలని ఇప్పటికే వేలంలో పెట్టిన కోయగూడెం, సత్తుపల్లి -3, శ్రావణపల్లి -3, కల్యాణి ఖని బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని కోరారు. సత్తుపల్లి బ్లాక్‌కి ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే ఓబీ పోయడానికి వారికి స్థలం లేదని, ఇల్లెందులోని కోల్ బ్లాక్ షెడ్యూల్ ఏరియాలో ఉందని దానిని ప్రైవేట్ వారికి కేటాయించడం పట్ల విరుద్ధమన్నారు. వీకే 7, ఆర్‌కేపీవోసీ, ఇల్లెందు 21 ఇంక్లైన్‌కి పర్యావరణ అనుమతులు రాక ఉత్పత్తికి తగ్గుతుందని వాటికి కూడా సహకరించాలని, కేంద్ర మంత్రి బొగ్గుబావుల శాఖ మంత్రిగా నియమితులైన వెంటనే ఒడిషాలోని నైనీ ప్రాజెక్టుకి పర్యావరణ అనుమతులు మంజూరు చేయడంలో కృషి చేసినందుకు యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. స్పందించిన కిషన్‌రెడ్డి తాను సింగరేణికి అండగా ఉంటానని హామీ ఇవ్వడమే రాకుండ ఇతర రాష్ట్రాల్లో సింగరేణి విస్తరణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహరెడ్డి, బీఎంఎస్ నాయకులు పులి రాజిరెడ్డి, రమాకాంత్, రిటైర్డ్ పెన్షన్ సంఘం నాయకులు దత్తాత్రేయ, వికాస్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం జూలై 8: రఘునాథపాలెం మండలం రేగులచెలక గ్రామానికి చెందిన కొర్లపా టి జ్యోజి(30) కూలి పనులు నిమిత్తం సోమవారం ఖమ్మం నగరానికి వచ్చాడు. చెరువుబజార్ లోని ఓ పాత భవనంపై పేరుకు పోయిన చెత్తను తొలగిస్తున్న క్రమంలో కాలుజారీ ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేశారు.

గుండెపోటుతో స్టాఫ్‌నర్స్ మృతి

భద్రాచలం, జూలై 8: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరి యా వైద్యశాలలో ప్రసూతి విభాగంలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న పి.కల్యాణి (36) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. విధులు నిర్వర్తించేందుకు వచ్చిన క్రమంలో ఒక్కసారిగా లేబర్ రూంలో కుప్పకూలారు. దీంతో గమనిం చిన సిబ్బంది వెంటనే ఆమెకు వైద్యం అందించేందుకు ప్రయత్నించగా, అప్పటికే మృతి చెందారు. సహచర ఉద్యోగి మృతి చెందడంతో వైద్యులు, సిబ్బంది దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడైన కలెక్టర్..

- విద్యార్థులకు మాటామంతీ
- పాఠశాల సమస్యలపై ఆరా


విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

ఏన్కూరు, జూలై 8: ఏన్కూరు మండలంలోని హిమాంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో కలిసి కింద కూర్చుని కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం విద్యార్థులతో నాలుగో తరగతి ఇంగ్లీష్, తెలుగు వరల్డ్ ఈస్ ఎంట్రీ, తెలంగాణ వైభవం పాఠాలను చదివించారు ఏకరూప దుస్తుల పంపిణీ, మధ్యాహ్న భోజనం వివరాలను హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్ పనులు పూర్తయినట్టు మైనర్ పనులు పురోగతిలో ఉన్నట్టు తెలిపారు. మిగులు పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులను 100శాతం ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ చేసి రెగ్యులర్ పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. పాఠశాల లోపల, ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని ఎక్కడా నీరు నిలవ ఉండకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాపల్లిలో ఆశా కార్యకర్త ఆత్మహత్య?

బోనకల్, జూలై 8: మండలంలోని రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ఆశా కార్యకర్త మృతి చెందడంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉంటుందన్న అనుమానాలు గ్రామంలో వ్యక్తమయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొల్లమందల పుల్లమ్మ(38) ఆశా కార్యకర్తగా పని చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. పుల్లమ్మ భర్త బ్రహ్మం మద్యం సేవించి తరుచు భార్యతో ఘర్షణకు దిగేవాడు. కుటుంబ బాధ్యతలను విస్మరించిన భర్త తరుచూ ఇబ్బంది పెట్టడం, కుటుంబ పోషణ బారంగా మారడంతో మనస్తాపం చెందిన ఆమె చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని ఆశా కార్యకర్తలు సంఘీబావం తెలిపారు.

ఫోర్జరీ సంతకాలతో నిధులు కాజేసిన ఉద్యోగిపై కేసు

ఖమ్మం క్రైం, జూలై 8: ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ నిధులు కాజేసిన సమగ్ర శిక్షా అభియాన్ శాఖ ఉద్యోగిపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నందు కేసునమోదైంది. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని సమగ్ర శిక్షా అభియాన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి రామకృష్ణ జిల్లాలోని పలు పాఠశాలలకు ప్రభుత్వం విడుదలచేసిన నిధులను ఫోర్జరీ సంతకాలతో తన ఖాతాలో జమచేసినట్లు గుర్తించారు. దీంతో డీఈవో సోమశేఖరశర్మ ఇటీవల ఫిర్యాదుచేయటంతో విచారణ చేపట్టిన పోలీసులు రామకృష్ణ రూ.1.82 కోట్లు మోసం చేసినట్లు గుర్తించారు. దీంతో అతనిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ


దరఖాస్తులను కంప్యూటరీకరిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, జూలై 8: దస్త్రాల్లో భూ సర్వే నంబర్ల వివరాలు తప్పులు దొర్లిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూమి ఒక దగ్గర ఉంటే , దానికి సంబంధించిన సర్వే నెంబర్లువేరే వారి పేరుమీద ఉన్నాయి.. దీంతో ఆ భూములను పరస్పరం మార్చుకునే వీలు లేక ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి బాధితులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిపై ప్రత్యేక సర్వే నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న క్రమంలో... సోమవారం కలెక్టర్ నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ధరణిపైనే దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఒకటి కాదు రెండేళ్ల కాదు ఐదేళ్లకు పైబడి తమ సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. భూదస్త్రాల ప్రక్షాళనే లక్ష్యంగా గత ప్రభుత్వం 2020 అక్టోబర్లో ధరణి పోర్టల్ తీసుకొచ్చింది. ఈ పోర్టల్లో తలెత్తిన చిక్కుము క్లతో ఖమ్మం జిల్లాల్లో అనేకమంది రైతులు సతమతమవుతున్నారు. సాంకేతిక కారణాలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులతో వేలాది భూసమస్యలకు పరిష్కారం లభించలేదు. ముఖ్యంగా మిస్సింగ్‌సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో తేడాలు, నిషేధిత భూముల జాబితాలో నమోదవటం, వార సత్వ భూములు, మ్యుటేషన్లు, గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ తదితర మాడ్యూల్స్ వల్ల కర్షకులకు కష్టాలు ఎదురవుతున్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలోమొత్తం 120కి పైగా అర్జీలు వస్తే వాటిలో ధరణి సమస్యలపై 50 వరకు అందడం గమనార్హం.

ఐదేళ్లుగా తిరుగుతున్నాం..

చింతనిప్పు విజయ, చింతకాని



నా భర్త పేరుతో చింతకాని మండలం కొదుమూరు రె వెన్యూలో 327 సర్వే నెంబర్‌లో 22.33 గుంటల భూమి ఉంది. మిస్సింగ్ సర్వే నెంబర్‌లో దరఖాస్తు చేశాం. ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. కనికరించడం లేదు.. పట్టాదారు పాసుపుస్తకం కోసం తిరుగుతున్నా మా పని అవ్వడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరికి కూడా వెళ్లాం. పరిష్క రించాలని జిల్లా అధికారులను ఆదేశించినా ఫలితమే లేదు.

హక్కు కల్పించడం లేదు..

బైరి నర్సింహారావు, సువర్ణపురం, ముదిగొండ మండలం



సువర్ణాపురం గ్రామంలో ఎకరం 30 గుంటల భూమి ఉంది. దానికి పాసు పుస్తకం కోసం దరఖాస్తు చేశా. ఎన్నో మార్లు సర్వే చేశారు. అదిగో ఇదిగో అంటున్నారు. ప్రతి వారం తహసీల్దారు కార్యాలయానికి తిరుగుతున్నా అక్కడ మమ్ముల్ని పట్టించుకోవడం లేదు. కలెక్టర్‌కు పిర్యాదు చేస్తే ప్రయోజనం కలగుతుందని వచ్చా. గత నాలుగేళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదు.

నా భూమిని ఆక్రమించేశారు..

షేక్ లాల్ మెహ్మద్, గొల్లగూడెం



గొల్లగూడెం వెలుగుమట్ల పరిధిలో సర్వేనెంబర్ 546ఇ లో ఎకరం 3 గుంటల స్థలం ఉంది. ఓ వ్యక్తికి నా అవసరం కోసం ఎకరం భూమిని విక్రయించాను. నాతో అతను వేరే వ్యక్తికి జీపీఏ చేయించుకున్నాడు. కానీ మిగిలిన 30 కుంటల స్థలాన్ని కూడా ఆక్రమించేసుకుని నన్ను ఆ భూమిలోకి అడ్డుకుంటున్నారు. ఈ భూమికి సంబందించిన పాస్ పుస్తకం పహణీ కూడా ఉంది. ఆక్రమించుకున్న ఆ భూమిని సర్వే చేయించి నా భూమిని ఇప్పించాలి.

బజారును ఆక్రమించి రేకుల షెడ్డు..

కుతుంబాక రమేష్, చైతన్యనగర్ ఖమ్మం



ఖమ్మం నగరంలో 10వ డివిజన్‌లో ప్లాట్ నెంబర్ 31లో రేకుల షెడ్ వేశారు. పడమర వైపున ఉన్న 30 అడుగుల రోడ్డును కబ్జా చేసి అక్రమంగా రేకుల షెడ్డుని నిర్మించారు. దీనిని తొలగించాలని గత ఏడాది నుంచి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చుట్టూ తిరుగుతున్నాం. అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి. వేసిన షెడ్డును తొలగించాలి.

ఐదేళ్లుగా సదరం సర్టిఫికెట్ కోసం..

ధరావత్ వీరమ్మ, రాజేశ్వరపురం నేలకొండపల్లి మండలం



నాకు ఆరేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఐదేళ్లుగా సదరం ధ్రువీకరణ పత్రం కోసం దరకాస్తు చేసుకుంటున్నా నిరాకరిస్తున్నారు. రెండు కాళ్లు పడిపోయి ఏ పనిచేయలేని దీనస్థితిలో ఉన్న నాకు సదరం ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వక పోవడంతో దుర్భర జీవనాన్ని గడపాల్సి వస్తున్నది. ధ్రువీకరణ పత్రం వస్తే పింఛన్ వస్తుందని ఐదేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి..

తేజావత్ నీల, భగవాన్ తండా,కూసుమంచి



పుట్టుకతో నాకు పోలియో వచ్చింది. రెండు కాళ్లు పడిపోయాయి. వికలాంగురాలని పెళ్లి కూడా చేసుకోలేదు. పూర్తిగా పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నా. నాకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇంటిని కేటాయించాలి. నా తదనంతరం తిరిగి ప్రభుత్వానికి ఆ ఇంటిని అప్పగిస్తా.

ప్రకృతి పండుగ సీత్లా

(5వ పేజీ తరువాయి)

చెల్లించటం ఈ పండుగ ప్రత్యేకత.. రెండు రాష్ట్రాల్లో ఉన్న ఈ తెగకు సంబంధించిన వారందరూ ఒకే రోజున సీత్లా భవానీ పండుగను జరపాలని సంఘం నాయకులు, పెద్దలు ఆశిస్తున్నప్పటికీ తండా వాసులు ఎక్కడికక్కడ తమకు వీలైన మంగళవారాల్లో పాటిస్తున్నారు..

ఎలా మొదలైందంటే..

ప్రాచీన కథ ప్రకారం ఒక తండాలో గాలికుంటు వ్యాధి తలెత్తి పశువులు రోగాలకు గురై మృత్యువాత పడుతున్న సమయంలో లంబడీల ఆరాధ్య దేవతల్లో ఒకరైన సీత్లా భవానీ కలలో కనపడి తనకు మొక్కులు చెల్లించాలని, పండుగ పాటించాలని ఆదేశించటంతో అప్పటినుండి పండుగ జరిపే ఆచారం మొదలయ్యిందని చెబుతారు.. పండగలో భాగంగా బోనాలు చెల్లించే సంప్రదాయం ఉండటంతో పలు రకాల ధాన్యాలను వారం రోజుల ముందుగానే నారుపోసి ఉంచుతారు. ఏనారు ఎక్కువగా పెరిగిందో ఆపంటను సాగుచేసే విధానం పట్ల కూడా వీరికి నమ్మకం ఉంది. నారును ప్రత్యేక మట్టి పాత్రలో ఉంచిబోనంగా ధరించి మేళతాళాలతో వెళ్లి దేవతకు సమర్పిస్తారు. పాయసం, గుగ్గిళ్ల వంటి ప్రసాదాలతోపాటు , కోళ్లను, మేకలను బలిచ్చే సంప్రదాయం కూడా ఉంది.

ఎందుకు పాటిస్తారంటే...

గ్రామంలో పశువులకు గాలికుంటువ్యాధి తలెత్తకుండా, దుష్టశక్తులు ప్రవేశించకుండా గ్రామదేవత కాపాడాలని, వర్షాలు సమృద్ధిగాకురిసి పాడిపంటలు వర్ధిల్లాలని, పశువులకు గడ్డి విరివిగా లభించాలని, పిల్లలకు ఎటువంటి సీజనల్ వ్యాధులు తలెత్తకూడదని, కోరుతూ సీత్లా భవానీదేవత విగ్రహాలను ప్రతిష్ఠించిన చోటుకు మేళతాళాలతో బయల్దేరి వెళతారు. పశువులకు వ్యాధులు రాక పోవటం, పిల్లలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా రక్షింపబడటం, వానలు సమృద్ధిగా కురిసి ఊరి చెరువులు నిండటం, పంటలు పండటం, ప్రకృతి పచ్చగా విలసిల్లటం కేవలం తండాలకే పరిమితం కాదు కదా...సీత్లాభవానీ పండుగ లంబాడీ సోదరుల పండుగగా కనిపిస్తున్నా.. పండుగ ఉద్దేశ్యం కులమతాలకు అతీతంగా అందరి సుభిక్షాన్ని కోరుకోవటం.. తమతోపాటు ఇతరులూ క్షేమంగా ఆనందగా ఉండాలని కోరుకోవటమే.

సప్త మాతృకలను పోలిన సీత్లామాతలు

పశుసంపద రక్షణకోసం బంజారాలు ఏడుగురు దేవతలైన మేరామ, తోళ్జా, మాత్రాల్, కంకాళి, హీంగ్లా, ద్వాళాంగర్, సీత్లా మాతలను పూజిస్తారు. వీరితోపాటు వారికి రక్షణగా ఉండే లుంకడ్యాను సైతం కొలుస్తారు. హిందూ దేవతల సప్త మాతృకలైన బ్రహ్మి, మహేశ్వర, కౌమారి, వైష్ణవి, వారాహి, నరసింహి. ఐంద్రిలను సీత్లా దేవతలు పోలి ఉండటం విశేషం.

కనువిందైన పూజలు

వర్షాకాల ఆరంభంలో పునర్వసు(పెద్దపుషాల) కార్తెలో మొదటి, రెండవ మంగళవారం సీత్లా మాతను బంజారాలు కొలుస్తారు. అన్ని పండుగలవలే ఇళ్లలో కాకుండా తండాకు దగ్గరలో ఉండే చెరువు ఒడ్డున ఈ పూజచేస్తాను. పొడవాటి రాళ్లతో తయారుచేసిన ఏడు ప్రతిమలను ఒకే వరుసలో ప్రతిష్ఠించి వాటికి ఎదురుగా వంద అడుగుల దూరంలో లుంకడ్యా ప్రతిమను ఏర్పాటు చేస్తారు.

కన్నె పిల్లలు సమర్పించే నైవేద్యం...

సీత్లా భవానీ ప్రతిమలను జాజు, పూలు, మామిడాకులతో అలంకరిస్తారు. ఒకరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలను నానబెట్టి తయారు చేసిన ఘూగ్రి (గుగ్గిళ్లను) నైవేద్యంగా సమర్పిస్తారు. దీనిని గిరిజనులు వాంసిడో (పాచీన నైవేద్యం) గా చెబుతారు. వాసండోను కన్నెపిల్లలు సీత్లా భవానీలకు సమర్పించడం ఆనవాయితీ. అనంతరం యువత మేళతాళాల మధ్య నృత్యాలుచేస్తూ గొర్రెపోతులు, మేకలను బలి ఇచ్చి వాటి పేగులు దేవతా ప్రతిమల నుంచి లుంకడ్యా ప్రతిమ వరకు పరుస్తారు. వాటి మీద నుంచి గిరిజనులు పశువులను దాటిస్తారు. ఇలా దీనిని దాటుడు పండుగగా పరిగణిస్తారు.

సీత్లాభవాని(దాటుడు) పండుగ ఈ నెల 9 నుంచి ప్రారంభం కానుంది. 15 రోజులపాటు జరిగే ఈ వేడుకలకు తండాలవాసులు సిద్ధం అవుతున్నారు. కాగా, అన్ని తండాల్లో మొదటి మంగళవారం రోజు (జూలై 9)న సీత్లా పండుగ జరుపుకోవాలని, ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఎర్రుపాలెం మండల అభివృద్ధి అధికారి భూక్యా సురేందర్‌నాయక్ కోరారు.



భూమి పోయింది...

పరిహారం ఏమైంది..?

» కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించడం లేదు..

» నిర్మాణం పూర్తి అవుతున్నా పట్టించుకోని అధికారులు..

» గగ్గోలు పెడుతున్న బీటీపీఎస్ నిర్వాసితులు..

మణుగూరు రూరల్, జూలై 8: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) నిర్మాణానికి రెండు పంటలు పండే సారవంతమైన భూములు రైతులు దారాధత్తం చేశారు. భూముల సేకరణ సమయంలో ప్రజలకు జెన్కో, ప్రభుత్వ అధికారులు అనేక హామీలు గుప్పించారు. నిర్వాసిత రైతులకు పరిహారంతో పాటు అర్హత గల వారికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో సారవంతమైన భూములను రైతులు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి అప్పగించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసిత రైతులకు రూ.ఐదున్నర లక్షలు, 18 ఏళ్లు నిండిన కుమారులు లేదా కుమార్తెలకు ఉద్యోగం ఇస్తామని చెప్పారు. పంట భూములను స్వాధీనం చేసుకున్న అధికారులు నిర్మాణం మొదలుపెట్టి ఆరేళ్లు కావస్తున్నప్పటికీ ఇప్పటికే అర్హత కలిగిన కొందరికీ పరిహారం అందక, ఉద్యోగం రాక కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. భూ ములు కోల్పోయిన రైతులకు వేయి మందికి పైగా పరిహారం అందగా, 364 మందికి ఉద్యోగ అవకాశం కల్పించారు. అదికూ డా ఐదేళ్లుగా అనేక పోరాటాలు ఆందోళనలు చేసిన ఫలితంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ నియామక పత్రాలు అందించింది. ఇంకా అర్హత గల అనేక మంది భూ నిర్వాసితులు ఉన్నప్పటికీ వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికీ రైతులు అధికారుల చుట్టూ వారు కాళ్లిరిగేలా తిరుగుతూనే ఉ న్నారు.

1,100 ఎకరాలు సేకరణ

బీటీపీఎస్ నిర్మాణానికి మణుగూరు పినపాక మండలాల సరిహద్దుల్లో రైతులకు చెందిన 1,100 ఎకరాల భూమిని సేకరించారు. వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం పంపిణీకి శ్రీకారం చుట్టారు. మొదట్లో పరిహారం పంపిణీకి చొరవ చూపిన అధికారులు.. మధ్యలో పర్యావరణ అనుమతులు రాక ప్లాంట్ పనులకు దాదాపు రెండున్నరేళ్లు బ్రేక్ పడింది. దీంతో పరిహారం పంపిణీపై అధికారులు నిర్లక్ష్యం వహించారు. కొందరు అధికారులు ఇదే అదునుగా చూసి చేతివాటం ప్రదర్శించడం మూలంగా అనర్హులను అందలం ఎక్కించి, అర్హులకు మొండిచేయి చూపారనే ఆరోపనలు వెల్లివెత్తాయి. నిర్వాసితులకు నేటికీ పరిహారం అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు ఆర్డీవో, హైకోర్టులను ఆశ్రయించినప్పటికీ ఆశించిన ఫలితం దక్కలేదు. ఉన్న భూములు పోయి పరిహారం అందక వారు గగ్గోలు పెడుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నూతనంగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఎకరం భూమి పోయింది....



● పుగాకు సత్యవతి

నా తల్లి గారు పసుపు కుంకుమ కింద ఇచ్చిన ఎకరం ఇరవై కుంటల భూమి ప్లాంట్ నిర్మాణంలో పోయింది. అధికారుల చుట్టూ తిరిగినా పరిహారం అందలేదు. ఉన్న భూమి పోయి నిర్వాసితులుగా మిగిలాం.. పిల్లలకు ఉద్యోగాలు రాలేదు.. కలెక్టర్ స్పందించి ఇకనైనా ఆదుకోవాలి.

మూడు ఎకరాలకు ఒకే ప్యాకేజీ ఇచ్చారు....

● కూసంపూడి వీరరాఘవులు

ప్లాంట్ నిర్మాణం కోసం మాకు ఉన్న మూడు ఎకరాల భూమి తీసుకున్నారు. కుటుంబంలో నలుగురు ఉన్నా ఒకే ప్యాకేజీ ఇచ్చారు. అధికారులు పట్టించుకోవడం లేదు. మిగతా ముగ్గురికి పరిహారం అందలేదు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించడం లేదు.

ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం...

● రాఘవరెడ్డి, మణుగూరు తహసీల్దార్

పరిహారం అందలేదని నేటికి కొందరు బీటీపీఎస్ నిర్వాసితులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ విషయాలను జిల్లా అధికారులకు సమాచారం అందిస్తున్నాం. వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

సమగ్ర శిక్షా అభియాన్‌లో...

చేతివాటంపై అనుమానాలు

» కారేపల్లి మోడల్ స్కూల్‌లో రూ.26లక్షల స్వాహా

» ఆడిట్ నిర్వహిస్తే మరిన్ని అక్రమాల చిట్టా బయటకు

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 8: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం విడదల చేసే స్కూల్ గ్రాంట్ నిధుల వ్యవహారంపై సక్రమంగా ఆడిట్ నిర్వహిస్తే అక్రమాల చిట్టా బైటకురానున్నదని తెలుస్తుంది. జిల్లాలోని కారేపల్లి మోడల్ స్కూల్‌లో జరిగిన రూ. 26లక్షల ప్రభుత్వ సొమ్మును ఓ అకౌంటెంట్ ఫోర్జరీ సంతకంతో స్వాహా చేసిన సంఘటనలో, కేవలం ఆ అకౌంటెంట్ ఒక్కడే స్వాహా చేశాడా, లేక అతనికి జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో మరికొందరు అధికారులు సహకరించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే దఫా కాకుండ రెండు దఫాలు నిధులను ఫోర్జరీ సంతకాలతో డ్రా చేసినప్పటికీ సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్‌కు, జిల్లా అకౌంట్ అధికారులకు విషయం తెలియకుండా ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం ఆడిట్ జరిగే సమయాల్లోనే బ్యాంక్ లావాదేవీలు చూసుకోవడం వెనుక మతలబు ఏమిటో తెలియాల్సి ఉంది. ప్రభుత్వం పాఠశాలకు విడుదల చేసిన నిధులను అభివృద్ధి పనులకు వాడాల్సిన నిధులను సంబంధిత ఉపాధ్యాయులు పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు వినబడుతున్న నేపథ్యంలోనే ఈ కారేపల్లి సంఘటన నిదర్శనం.

కేవలం ఒక్క పాఠశాలలోనే రూ.26 లక్షలు స్వాహా జరిగితే జిల్లా వ్యాప్తంగా ఉన్న 1280 ప్రభుత్వ పాఠశాలల్లో ఆడిట్ నిర్వహిస్తే ఎన్ని అక్రమాలు బైటపడతాయో తెలియాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల నిర్వాహణే అంతంత మాత్రంగా ఉంటే ఈ నిధుల పక్కదారి పడుతుంటే ఇక పాఠశాలల అభివృద్ధి ఏమిజరుగుతుందని పలువురు విద్యార్థుల తల్లితండ్రులు వాపోతున్నారు. ప్రస్తుతం ఏ బ్యాంక్ నుంచైనా రూ.100 డ్రా చేస్తేనే సంబంధిత మొబైల్‌కు, లేదా మెయిల్‌కో తప్పని సరిగా మెస్సేజ్ వస్తుంది. రూ.లక్షల్లో డ్రా చేసేటప్పుడు బ్యాంక్ అధికారులు సంబంధిత ఎకౌంట్ హోల్డర్‌కు ఫోన్‌లో సంప్రదించిన అనంతరమే చెక్ పాస్ చేస్తున్న సమయాల్లో రూ.26 లక్షలు ఫోర్జరీ సంతకాలతో నిధులను డ్రా చేసిన విషయం తెలవదంటే అధికారుల పని తీరు ఎలా ఉందో అర్థమవుతుంది. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల నిధుల వినియోగంపై తప్పని సరిగా ఆడిట్ నిర్వహిస్తే మరికొంత మంది చేతివాటం ప్రదర్శించే అధికారులు బైట పడవచ్చుననే వాదనలు వినపడుతున్నాయి. చేతివాటం ప్రదర్శించే అధికారులపై, సహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

పంటలకు గిట్టుబాటు ధరకు కృషి ...

● రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులైన రాయల నాగేశ్వరరావు



ఖమ్మం, జూలై8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒక రైతుబిడ్డగా ఉన్న నాకు రైతుసంక్షేమం కోసం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర గిడ్డంగులు సంస్థ చైర్మన్‌గా రాష్ట్రంలో రైతులకు అవసరమైన చోట గిడ్డంగులు నిర్మించి రైతుకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిలవ ఉంచుకునేలా కృషి చేస్తానని అన్నారు. నాకెంతో ఇష్టమైన వ్యవసాయానికి సంబంధించిన గోదాంల నిర్మాణం చేపట్టి, రైతులకు సేవ చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు ఇంకా ఉన్నారని, వారిని కూడా గుర్తించి వారికి కూడా తగిన పదవులు కేటాయించాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా బాధ్యతుల చేపట్టి, రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటించి అవసరం ఉన్న పంటలకు ఏసీ, నాన్ ఏసీ గోదాంల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు కేటాయింపులు చేసి గోదాంలు నిర్మించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు.

అడవులను అభివృద్ధి చేసి చూపిస్తా

● అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య



భద్రాచలం, జూలై 8: రాష్ట్రంలో అంతరించిపోతున్న అటవీ సంపదను పరిరక్షించేందుకు అంకితభావంతో కృషి చేస్తా...అడవులను అభివృద్ధి చేసి చూపిస్తానని అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ అధికారికంగా సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. మూడుసార్లు ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించిన పొదెం వీరయ్య ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కాగా వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా వీరయ్య ఆంధ్రజ్యోతితో ఫోన్లో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అడవులను అనాధిగా గిరిజనులు రక్షిస్తున్నారని, అడవులను పరిరక్షించుకునే బాధ్యత ముందు సైతం గిరిజనులతో పాటు ప్రతి ఒక్కరు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు అభివృద్ధి చెందితేనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి నా వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

సాగునీటి కల్పనకు కృషి.....

● రాష్ట్ర నీటిపారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు



భద్రాచలం, జూలై 8: రాష్ట్ర నీటిపారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా ప్రభుత్వం నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు మువ్వా విజయ్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు రైతులకు సహాయం చేసే పదవి రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర నీటిపారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా చిన్న సన్నకారు రైతులకు అలాగే సాగునీటి అవసరాల లేని చోట రైతాంగానికి సాగునీరు కల్పించి పంటలు పండింపచేసేందుకు నావంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర నీటిపారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా త్వరలోనే బాధ్యతలు చేపట్టి శాఖపై అధ్యయనం చేయడం జరుగుతుందని తెలిపారు..ప్రాజెక్టులు, లిఫ్టులు నుంచి నీరు లభించని చోట రైతులకు చెక్‌డ్యాంలు, చెరువులు, బోర్లు, మోటార్లు, బావులు ఇలా చిన్న, మధ్యతరహా నీటిసదుపాయాల ద్వారా అవకాశం ఉన్నంత వరకు రైతులకు సాగునీరు అందించి వారి పంటలు పండించేలా సహకారం అందించాలన్నదే నాలక్ష్యమని పేర్కొన్నారు.

హస్తకళలను ప్రోత్సహిస్తాం..

● రాష్ట్ర హస్తకళలాభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ



వైరా, జూలై 8: హస్తకళలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రోత్సహిస్తామని రాష్ట్ర హస్తకళలాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన నాయుడు సత్యనారాయణ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. అన్నిరకాల చేతివృత్తులను ప్రోత్సహిస్తామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రాధాన్యతనిస్తామని, వారి ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు సంస్థకు ఆదాయాన్ని పెంచేవిధంగా చర్యలు తీసుకుంటాం. ఢిల్లీ అలాగే అం తర్జాతీయస్థాయిలో ఈ హస్తకళా ప్రదర్శనలు ఏర్పాటుచేసి వాటి అభివృద్ధికి కృషిచేస్తాం. రాష్ట్ర హస్తకళలాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వ రలోనే బాధ్యతలు చేపట్టి శాఖపై అధ్యయనం చేయడం జరుగుతుందని తెలిపారు..

లారీ ఢీకొని ఆటోడ్రైవర్ దుర్మరణం

● రామగోవిందాపురంలో ఘటన



తిమోతి(ఫైల్)

సత్తుపల్లిరూరల్, జూలై8: ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తున్న ఓ ఆటోడ్రైవర్ ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం సత్తుపల్లి మండలం రామగోవిందాపురంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని చింతలపూడి మండలంలోని మేడిశెట్టి వారిపాలేనికి చెందిన నంద్యాల శ్రీను, సీత దంపతుల కుమారుడు తిమోతి (26) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గంగారం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అశ్వారావుపేట నుంచి వస్తున్న లారీ రామగోవిందాపురం దాటిన వద్ద జాతీయ రహదారిపై వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలం వద్ద, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బంధువుల రోదనలు మిన్నంటయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి భార్య ప్రస్తుతం గర్భవతి కాగా, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నేలకొండపల్లి, జూలై8: ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అమ్మగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మగూడెం గ్రామానికి చెందిన అడపాల హరికృష్ణ(38) కుటుంబ తగాదాల నేపథ్యంలో ఆదివారం పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన సమీప రైతులు వెంటనే అతడిని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. ఖమ్మంలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా తన కుమారుడు అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ తోట నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి బుంగలో ఇరుక్కొని ఒకరు...



రమేష్ మృతదేహం

మధిరటౌన్, జూలై8: నీటి బుంగలో ఇరుక్కొని ఊపిరి ఆడక ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మధిర శివాలయం వద్ద వైరా నదిలోని చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన బోసెట్టి రమేష్(35) మధిర నుంచి తన స్వగ్రామం వెళ్లే క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలకు మధిరలోని వైరా నదిలో వేసవిలో ఏర్పాటు చేసిన తాత్కలిక రోడ్డుపై వద్ద బుంగలు నిండి నీరు ప్రవహిస్తుండటంతో అందులోకి జారీ పడ్డాడు. నీళ్లలో పడగానే నీటి ప్రవాహానికి అతడి తల బుంగలోకి ఇరుక్కోవడంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే మరణించాడు. కాగా మృతుడు వంట పనులు చేస్తూ జీవిస్తూ ఉంటాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని టౌన్ ఎస్ఐ సంధ్య సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో శిశువు విక్రయం

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

● పాపను తల్లిదండ్రులకు అప్పగించిన ఐసీడీఎస్ అధికారులు

తిరుమలాయపాలెం, జూలై 8: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో శిశు విక్రయ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మడలంలోని ఓ గిరిజన తండాకు చెందిన దంపతులకు ఇదరు ఆడపిల్లలుండగా మూడో కాన్పులోనూ వారికి ఆడపిల్ల పుట్టడంతో ఆ పాపను విక్రయించి చనిపోయినట్టుగా నమ్మించారు. ఇదే విషయాన్ని అదే గ్రామానికి చెందిన ఆశావర్కర్ స్థానిక అంగన్‌వాడీ టీచర్‌కు చెప్పింది. అయితే పాప తల్లికి ఫీడింగ్ అందించేందుకు అంగన్‌వాడీ టీచర్ ఎన్ఎస్‌పీఎస్ యాప్‌లో ఆమె వివరాలు నమోదు చేసే క్రమంలో మరోసారి ఆరా తీయగా పాప తల్లి అసలు విషయాన్ని బయపెట్టింది. తనకు మూడో కాన్పులోనూ పాప పుట్టిందని, పుట్టిన వెంటనే ఆ పాపను మరొకరికి విక్రయించినట్లు తెలిపింది. ఈ వ్యవహారంలో ఓ ఆర్ఎంపీ వైద్యుడి పాత్రకూడా ఉన్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఐసీడీఎస్ అధికారులకు తెలపడంతో వారు పాప తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి నాలుగునెలల పసికందును 15రోజుల క్రితం తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. అయితే అంగన్‌వాడీ టీచర్ ద్వారానే ఈ విషయం బయటికొచ్చిందని ఆరోపిస్తూ సోమవారం స్థానిక ఆశా వర్కర్ బంధువులు ఆమెపై దుర్భాషలాడుతూ దాడికి యత్నించారు. దాంతో అంగన్‌వాడీ టీచర్ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ఐసీడీఎస్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీ టీచర్ ఆవేదన వ్యక్తం చేసింది.

పేకాట రాయుళ్ల అరెస్టు

● రూ.11లక్షలు, మూడుకార్లు స్వాధీనం

ఖమ్మంక్రైం, జూలై8: నగరంలోని అర్బన్ పోలీసుస్టేషన్ పరిధిలో పేకాట పాడుతున్న 10మందిని అరెస్టు చేసినట్టు అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. టాస్కుఫోర్సు, ఖానాపురంహవేలి పోలీసులు కలిసి అర్బన్ పరిధిలోని సాయినగర్‌లోని ఓ ఇంట్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 మందిని అరెస్టు చేయగా, వారి వద్ద నుంచి రూ.11,40,670నగదును, మూడు కార్లు, పది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

ఆగస్టు 15నాటికి రుణమాఫీ

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

వేంసూరు, జూలై 8: వచ్చేనెల 15నాటికి రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ అమలుచేయటం జరుగుతుందని, సాగుచేసే భూములకే రైతుభరోసా అమలుచేయటం జరుగుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం వేంసూరులో గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, జీఎం బాపినీడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా మండల కాంగ్రెస్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీడుభూములు, గుట్టలకు రైతుభరోసా ఇవ్వడం వల్ల రూ.25వేల కోట్లు దుర్వినియోగమయ్యాయని తమ ప్రభుత్వం నిధులు దుర్వినియోగం కాకుండా సాగుచేసే భూములకే రైతుభరోసా అమలుకు సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలు సేకరించిన తర్వాతనే 15రోజుల్లో ఒక స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమాను అమలుచేస్తుందన్నారు. బీమా ప్రీమియం రూ.రెండు వేల కోట్లను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఇందుకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి టెండర్లు పిలిచి రైతులకు ఉపయోగపడేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం ఒక అడుగు ముందే ఉంటుందన్నారు. రైతు బీమాను కొనసాగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తన భుజాలపై ఎత్తుకొని రాజకీయ అక్షరాభ్యాసం నేర్పిన సత్తుపల్లి నియోజకవర్గానికి గోదావరి జలాలను తీసుకురావడమే తన ధ్యేయమన్నారు. నెలరోజుల్లో లంకాసాగర్ ప్రాజెక్టుకు గోదావరి జలాలను తీసుకువస్తాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది కల్లా ఎన్టీఆర్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వేంసూరు మండలానికి అందించటం జరుగుతుందన్నారు. రైతులు పామాయిల్ సాగు చేసేవిధంగా వారిని ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. త్వరలో వేంసూరులో పామాయిల్ ఫ్యాక్టరీ పనులను ప్రారంభించటం జరుగుతుందని రైతులు పామాయిల్ సాగుపై దృష్టిసారించాలని కోరారు. సహకార స్ఫూర్తితో వచ్చిన సహకార సంఘాలు రైతులకు ఉపయోగపడటం లేదనే భావన ఉంది. సహకార బ్యాంకులో రుణాలు తీసుకున్న వారికే మెంబర్‌షిప్ ఉండాలి. రైతులకు కావల్సిన అన్నింటినీ రివైజ్ చేసి వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

వేంసూరులో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఎగ్జిట్‌ను మంజూరు చేయించిన మంత్రి తుమ్మలను గ్రామస్థులు, రైతులు ఘనంగా సన్మానించారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్‌బంకును మంత్రి తుమ్మల ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ సారయ్య, కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల సోమిరెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, ఎండీ.ఫైజుద్దీన్, చల్లా సత్యనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షులు గోపాలకృష్ణ, సోమిరెడ్డి, సంజీవరెడ్డి, మోరంపూడి సుబ్బారావు, సురేష్, మామిళ్లపల్లి వెంకటేశ్వరరావు, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, తుంబూరు రామిరెడ్డి, సీపీఎం నాయకుడు కట్టా సత్యనారాయణ, సీపీఐ నాయకులు బండి ఆదినారాయణ, గడిపర్తి రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాలి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 8: జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మంత్రి తుమ్మల కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ లతో సమావేశమయ్యారు. జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నగరాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. యువతకు మత్తు పదార్థాలు అందించే ముఠాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. కలెక్టరేట్ కు వచ్చిన మంత్రికి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన మంత్రి, వాటిని కలెక్టర్ కు అందజేసి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతు ఆత్మహత్యాయత్నం

» తన పొలాన్ని చదును చేస్తుండగా అడ్డుకున్నారని ఆరోపణ » బాణాపురంలో ఘటన



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు సీతయ్య

ముదిగొండ, జూలై 8: తన పట్టా పొలంలో ఎక్స్‌కవేటర్‌తో భూమిని చదును చేస్తుండగా కొంతమంది గ్రామస్థులు అడ్డగిస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ రైతు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం మండలంలోని బాణాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు మేడి సీతయ్య, అతడి కుటుంబసభ్యులు కమలాపురం రెవెన్యూ పరిధిలో 5ఎకరాల 37కుంటల భూమిని కొనుగోలు చేసి సాగుచేస్తున్నారు. ఈ క్రమంలో తమ పొలంలో చదునుచేసేందుకు సోమవారం ప్రయత్నిస్తుండగా కమలాపురం గ్రామానికి చెందిన కొంతమంది గ్రామస్థులు అడ్డగించారని ఆరోపిస్తూ రైతు సీతయ్య క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే అతడిని ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు అధికారులు పొలం చదును చేస్తుండగా అడ్డుకన్నారని, కులం పేరుతో దూషించారని బాధితుడు సీతయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గజ్జల నరేష్ తెలిపారు. కానీ ఇదే విషయమై ఇరిగేషన్ డీఈ రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీతయ్య కుటుంబ సభ్యులపై డీఈ ఫిర్యాదు

ముదిగొండ మండలం కమలాపురం రెవెన్యూ పరిధిలో చెరువు శిఖం భూమిలో మేడి సీతయ్య, ఆయన కుటుంబసభ్యులు చెరువులోకి వర్షపునీరు సహజసిద్ధంగా వెళ్లకుండా పెద్ద కట్ట పోశారని ఇరిగేషన్ డీఈ రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీతయ్య అతడి కుటుంబసభ్యులు 40రోజుల క్రితం చెరువుకు, రైతులపొలాలకు నీరు వెళ్లకుండా కట్ట పోశారని గ్రామస్థులు, మత్స్యసహకార సంఘం సభ్యులు డీఈ రాంబాబుకు ఫిర్యాదు చేయగా పరిశీలించి అక్రమంగా పోసిన కట్టను తొలగించారు. ఆదివారం మళ్లీ అక్రమంగా కట్టను నిర్మిస్తున్నారని సమాచారం తెలుసుకున్న ముదిగొండ మండల ఇరిగేషన్ ఏఈ భగీరథబాబు చెరువు వద్దకు వెళ్లగా రైతు సీతయ్య తమ పొలంలో కట్టను తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానని ఏఈని బెదిరించాడని, సోమవారం మళ్లీ కట్టను పోస్తుండగా మత్స్య సహకార సంఘం సభ్యులు వెళ్లి ప్రశ్నించగా వారిని బెదిరించడానికి క్రిమిసంహారక మందు తాగాడని డీఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కిరణ్ అంత్యక్రియలు పూర్తి

•అమెరికాలో నీట మునిగి మృతి చెందిన కిరణ్

• సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి నివాళి



కిరణ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, జూలై 8 అమెరికాలో ఈ నెల 28 వతేదిన ఈత కొలనులో ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందిన శ్రీనాథరాజు కిరణ్ మృతదే హం సోమవారం కల్లూరు మండలంలోని స్వగామమైన చిన్నకోరుకొండికి చేరుకున్నది. అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలోని శాండిల్ ఎస్ నగరంలో ఓ అపార్టుమెంట్ సమీపంలో గల ఈత కొలను వద్ద స్నేహితులతో సరదాగా ఈత కోసం వెళ్లగా, కిరణ్ ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందిన విషయం విధితమే. కాగా కిరణ్ మృతదేహాన్ని అమెరికా నుంచి ఎన్నారైల సహకారంతో హైదరాబాద్‌కు ఆదివారం తీసుకోరాగా, అక్కడ నుంచి సోమవారం మధ్యాహ్నం 1 గంటకు చిన్నకోరుకొండిలోని తన స్వగ్రాహానికి చేర్చారు. అమెరికాలో నింబంధనల ప్రకారం ఈత కోలనులో కిరణ్ మృతి చెందిన సంఘటనపై అక్కడ పోలీసులు సమగ్ర విచారణ నివేదిక పూర్తి చేసేందుకు పద కొండు రోజుల వరకు పట్టింది.

కిరణ్ కుంటుంబ సభ్యులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, సంతాపం తెలిపారు. జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, విశ్రాంత ఏఎస్ఐ కుమ్మరి రామారావు, పసుమర్తి చందర్‌రావు, బూదాటి నారపరెడ్డి, తోటకూర శేషగిరిరావు, కొంగర రామకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, చినాల వెంకటేశ్వరరావు, ఈవూరి నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆటో ఫల్టీ.. ఇద్దరికి గాయాలు

ఖమ్మంక్రైం, జూలై8: ఆటో ఫల్టీ కొట్టడంతో ఇద్దరు విద్యార్థులకు గాయాలైన సంఘటన సోమవారం ఖమ్మం నగరంలో జరిగింది. నగర పరిధిలోని దానవాయిగూడేనికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు నగరంలోని బైపాస్ రోడ్డు సమీపంలోని ఓపాఠశాలలో చదువుతున్నారు. రోజు ఇంటి వద్ద నుంచి అదే ప్రాంతానికి చెందిన ఓఆటోలో స్కూల్‌కు వెళ్తుంటారు. సోమవారం సదరు విద్యార్థులను నగరంలోని స్కూల్ వద్దకు ఆటోలో తీసుకువస్తున్నాడు. ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోకి రాగానే ఓద్విచక్ర వాహనం అతివేగంగా వస్తూ రోడ్డును దాటుతుండగా, ఈక్రమంలో వేగంగా వస్తున్న ఆటో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆటో ఒక్కసారిగా ఫల్టీ కొట్టింది. దీంతో ఆటోలోని విద్యార్థులకు గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న విద్యార్థులను స్థానికులు బయటకు తీసి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ఆసుపత్రికి తరలించారు.

21 కిలోల గంజాయి స్వాధీనం


● ఏడుగురు వ్యక్తుల అరెస్ట్ ● వివరాలు వెల్లడించిన సీఐ శివప్రసాద్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై8: 21 కిలోల గంజాయిని కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ ఈ సంఘటనకు సంబంధించి తెలిపిన వివరాల ప్రకారం.. న్యూగొల్లగూడెం వద్ద ఎస్ఐ పురుషోత్తం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రెండు కార్లను ఆపి తనిఖీ చేస్తున్న క్రమంలో రెండు కార్లలో ఉన్న ఏడుగురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ రెండు కార్లను తనిఖీ చేసి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో మేడ్చల్ జిల్లాకు చెందిన బాదల్‌రౌత్, నితీష్ యాదవ్(అలియాస్ మోనో), ముమ్మడి విష్ణువర్ధన్‌రెడ్డి, సిద్దిపేట జిల్లాకు చెందిన కాలువ వెంకటేష్, మహ్మద్ సాదు, మోతె ఆకాష్, వరంగల్ జిల్లాకు చెందిన తిరుపతి హరీష్‌లు ఉన్నారు. వీరి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనపరుచుకున్నట్లు సీఐ తెలిపారు.



గంజాయి నిందితులతో పోలీసులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
మంగళవారం 9 జూలై 2024



ఆక్రమణలు తొలగించాలని రిలే దీక్షలు

చర్ల, జూలై 8: చర్ల మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం సమీపంలోని ప్రభుత్వ భూములను కొంత మంది ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ చర్ల సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో చర్ల గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడుతూ, సాయిబాబా ఆలయం సమీపంలోని భూములను కన్యాకా పరమేశ్వరి ఆలయానికి ప్రభుత్వం రాసిచిందన్నారు. కానీ కొంత మంది భూములు అక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. వెంటనే భూములను స్వాధీనం చేసుకుని ఆలయానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారులుకు చెప్పినా పట్టించు కోవడం లేనది, అప్పటి వరకు రీలేదీక్షలు కొసాగిస్తామని తెలిపారు. ఇళ్లకు ఇచ్చిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు, మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే... ఘనంగా జన్మదిన వేడుకలు

దమ్మపేట, జూలై 8: తనను బారీ మెజారీటితో గెలిపించిన అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఎమ్మెల్యే 41వ జన్మదినోత్సవ వేడుకలు గండుగులపల్లిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 41కిలోల భారీ కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలకు మొదటి ప్రాధాన్యతగా వైద్యం, విద్య అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎప్పుడూ అందుబాటులో వుంటానని సమస్యల పరిష్కారం కోసం తనను నేరుగా కలవవచ్చునన్నారు. మండలంలో పలు గ్రామాలలో జారే జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించారు. మొద్దులగూడెం గ్రామంలో జారే జన్మదిన వేడుకలు నిర్వహించి గర్భిణులకు కొడిగుడ్లు, పండ్లు పంపిణీ చేసారు. జరేను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో దమ్మపేట సొసైటీ ఛైర్మన్ ఎల్లిన రాఘవరావరావు, ఎల్లిన మురళీ, ఎర్రగొర్ల రాధాకృష్ణ, ఎంపీపీ సోయం ప్రసాదు. కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, రావు గంగాధరరావు, రవిశంకర్, కోటగిరి సత్యంబాబు, చిన్నంశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, దొడ్డా బాస్కరరావు, దొడ్డా చిన సత్యం, మన్నెం అప్పారావు, అత్తులూరి వెంకటరామారావు, రమేష్ తదితరులున్నారు.



గండుగులపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జారే

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి: మండల వ్యాప్తంగా ఆశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకులు పర్సా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక కట్ చేసి, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వేముల రమణ, వనమా గాంధీ, గఫార్, దస్తగిరి, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లిలో వేడుకలు

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే జారే పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. అనంతరం అమ్మా వృద్దుల అనాధశ్రమంలో వృద్దులకు దుప్పట్లు, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, ప్రమోద్, తుమ్మరాంబాబు, ఎంపీటీసీ వేముల భారతి, మిండా హరిబాబు, అప్పలరాజు, నార్లపాటి రాములు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో రైతుల కుదేలు: కూనంనేని



మహాసభలో మాట్లాడుతున్న కూనంనేని

దుమ్ముగూడెం, జూలై 8: బీజేపీ, బీఆర్ఎస్ విధానాలతో రాష్ట్ర వ్యవసాయ రంగం కుదేలైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. గంగోలు ప్రైవేటు ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం భద్రాద్రి జిల్లా రెండవ మహాసభలో ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ నల్ల చట్టాలను తెచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ రంగం చేతిలో పెట్టేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. రైతు రుణమాఫీ చేసేందుకు చేతులు రాని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్ల రాయితీలను ప్రకటించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. రైతును విస్మరించే ఏ నాయకులైనా అధికారాన్ని కోల్పోక తప్పదని గుర్తు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ప్రధాన కార్యదర్శి పద్మ, ఏపూరి బ్రహ్మం, నారాటి ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వరావు, పుల్లారెడ్డి, ఎల్లయ్య, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, ముత్యాల విశ్వనాధం, రావుపల్లి రవికుమార్, కిలిమి ఎల్లారెడ్డి, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ బదిలీతో కన్నీటి పర్యంతమైన విద్యార్థులు

బూర్గంపాడు, జూలై 8: బూర్గంపాడు మండల పరిధిలోని సోంపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం కన్నీటి పర్యంతమయ్యారు. 12 ఏళ్లుగా పాఠశాలలో విద్యాబుధ్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు తేజావత్ మోహన్ బదిలీపై వెళ్తుండడంతో విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఉపాధ్యాయుడిని చుట్టిముట్టి వెళ్లొద్దు సార్ అంటూ భోరున విలపించారు. విద్యార్థుల ప్రేమాభిమానాలకు ఉపాధ్యాయుడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వెళ్లక తప్పదని నచ్చజెప్పడంతో విద్యార్థులు తమ ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

కొత్తగూడెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధాకారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దరఖాస్తుచేసిన అభ్యర్థుల వివరాలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలుచేపట్టాలని అధికారులను ఆదేశించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అన్నిశాఖల అధికారులు తమ సిబ్బంది బదిలీ దరఖాస్తులను 12 వరకు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. 13 నుంచి 18 వరకూ దరఖాస్తుల పరిశీలన ఉంటుందని తెలిపారు.

ఆర్యవైశ్యసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యుగంధర్



నియామకపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు

దమ్మపేట, జూలై 8: ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దమ్మపేటకు చెందిన దారా యుగంధర్‌ను నియమించారు. కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దారా రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుగూరి నగేష్ సోమవారం నియామకపత్రాన్నీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాసభ కార్యవర్గసభ్యుడు పెంద్యాల విజయ్ భాస్కర్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు దారా నగేష్, మండల అధ్యక్షుడు రాంభద్రం పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

జడ్పీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి, జూలై 8: నిబద్ధతతో పని చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పేరు తేవాలని జడ్పీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు సూచించారు. నూతనంగా కారుణ్య నియామకాలు పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలను జడ్పీ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అందజేశారు. సోమవారం జడ్పీ కార్యాలయ సమావేశ హాలులో ఐదుగురు ఉద్యోగులకు ఈ నియామక ఉత్తర్వులను అందజేసి మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగులుగా కొనసాగుతూ అకాల మృతి చెందిన ఉద్యోగ కుటుంబ వారసులకు ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకోగా అర్హత కలిగిన అభ్యర్థుల ఐదుగురిని ఆఫీస్ సబ్ ఆర్డినెంట్లుగా నియమించామన్నారు. ఉత్తర్వులు పొందిన వారిలో మన్నె లక్ష్మీప్రసన్న, మీర్జాముస్తాఫాబేగ్, భూక్యా గంగా, ఇస్నపల్లి అరుణ, శ్యామల స్వాతిలు ఉన్నారు. వీరిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.చంద్ర శేఖర్, కార్యాలయ సూపరెంటెండెంట్ అరుణ, సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ నయీముద్దీన్, ఛైర్మన్ క్యాంపు క్లర్క్ వై.శ్రీకాంత్‌రెడ్డి, బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు పొందిన వారితో కంచర్ల

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న స్థానికులు

దుమ్ముగూడెం, జూలై 8: పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఏజే ప్రభాకర్‌ను అచ్యుతాపురం గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని ఆదివాసీలంతా కలిసి గ్రామ శివారు నుంచి సన్మాన వేదిక వరకు భాజా భజంత్రీలు, బాణాసంచాల సందడితో ప్రభాకర్‌ను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయడంతోపాటు గ్రామాభివృద్ధికి తోడ్పడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలకు సహకరించారంటూ పలువురు సేవలను పలువురు కొనియాడారు. ఎంపీపీ లక్ష్మి, ఎంఈవో సమ్మయ్య, కాంప్లెక్సు హెచ్ఎం రామారావు, హెచ్ఎంలు నాగమణి, మేరీ కుమారి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మరో సకలజనుల సమ్మెకు సిద్ధం కావాలి..



మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

ఇల్లెందు టౌన్, జూలై 8: సింగరేణి నూతన బొగ్గుబ్లాక్‌లను వేలం వేయకుండా సింగరేణికే కేటాయించాలని లేదంటే మరో సకల జనుల సమ్మెకు పూనుకుంటామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య హెచ్చరించారు. సోమవారం ఇల్లెందులో చేట్టిన దీక్షలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు.

హామీలను నెరవేర్చాలని ఆందోళన

సమ స్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి

జూలూరుపాడు, జూలై 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం జూలూరుపాడులోని తహసీల్దార్ కార్యలయం ఎదుట నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు రైతులను మోసగించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఎలాంటి నిబంధనలు విధించకుండా ప్రతి రైతుకు ఎంత అప్పు ఉన్న రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని, సాగుచేస్తున్న ప్రతి రైతుకి రైతు భరోసా పథకం కింద రూ. 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి పంటల బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్య క్షుడు మాదినేని సతీష్, జిల్లా నాయకులు నున్నా రమేష్, బీజేపీ మం డల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిరిపురపు ప్రసాద్, భూక్య రమేష్, పల్లారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కిసాన్ మోర్చా నాయకులు

వైఎస్ఆర్ సేవలు మరువలేనివి

మణుగూరు, జూలై 8 : దివంగత నేత , మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకను రెడ్డీస్ సమాఖ్య అధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మణుగూరు మండల రెడ్డిస్ సమాఖ్య అధ్యక్షుడు విజయ భాస్కర్ రెడ్డి, సామా శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వైఎస్ఆర్ చేసిన మేలును కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అశోక్ రెడ్డి, రాఘవ రెడ్డి, అవినాష్‌రెడ్డి, అశోక్, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కొండారెడ్డి, మౌనిక వెంకటరెడ్డి, సురేందర్ రెడ్డి, శ్యామల రామిరెడ్డి, సారంపల్లి రాంరెడ్డి, రాంరెడ్డి, శంకర్ రెడ్డి , నర్సిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ఆదిరెడ్డి, కోటి రెడ్డి, దేవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఇల్లెందు టౌన్, జూలై 8: భద్రాచలంలో న్యాయవాదిపై పోలీసులు అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ సోమవారం ఇల్లెందు కోర్టు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కోర్టులో నిరసన అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూక్యా రవికుమార్, జనరల్ సెక్రటరీ కాంపల్లి ఉమామహేశ్వరరావు మాట్లాడారు.

మణుగూరులో..

మణుగూరు: భద్రాచలంలోని ఓ న్యాయవాది పై పోలీసులు అనుచిత దోరణులు అవలంభిస్తూ కోర్టుప్రాంగణంలో వ్యవహరించడాన్ని మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర స్థాయిలో ఖండించారు. సోమవారం ఇందుకు నిరసన వ్యక్తం చేశారు. విధులను బహిష్కరించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సారపాకలో చోరీ

బూర్గంపాడు, జూలై 8: బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో సోమవారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం సారపాకలోని మీసేవ సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని అదనపు ఎస్ఐ నాగభిక్షం తెలిపారు.

నిబద్ధత కలిగిన నాయకుడు స్వరాజ్యరావు: కూనంనేని

జూలూరుపాడు, జూలై 8: జూలూరుపాడుకు చెందిన రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, సీపీఐ సీనియర్ నాయకుడు చింతా స్వరాజ్యరావు తుదిశ్వాస వరకు పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసి నిబద్ధత కలిగిన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం జూలూరుపాడులో స్వరాజ్యరావు దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సతీమణి నాగరత్నాన్ని ఓదార్చి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ, రైతు సంఘం బలోపేతానికి కృషి చేసిన నాయకుల్లో స్వరాజ్యరావు ఒకరని, ఆయన మరణం ఈ ప్రాంత ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. ఆయన ఆశయసాధన కోసం నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్, నాగుల్‌మీరా, వై.మధు, చాంద్‌పాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కూనంనేని

వేతన బకాయిలు చెల్లించాలి: ఎమ్మెల్యే



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, జూలై 8: భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు వర్కర్లకు మూడు రోజుల్లో వేతన బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. లేదంటే సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టడానికి సిఫారసు చేస్తామని స్పష్టం చేశారు. భద్రాచలంలో సోమవారం ఏరియా వైద్యశాలలోని వివిధ వార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల ప్రాంగణంలో చెట్లు విరిగి విద్యుత్తు తీగలకు ఇబ్బందికరంగా ఉందని పేర్కొనడంతో సంబంధిత అధికారులకు వెంటనే ఈ విషయాన్ని తెలియజేసి విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంటు డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంవో రాజశేఖర్‌రెడ్డి, వైద్యులు సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు

జూలూరుపాడు, జూలై 8: పాపకొల్లు పంచాయతీ పరిధిలోని బీమ్లా తండా గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేకపోవటంతో గిరిజన్లు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో సమస్యను విద్యుత్ శాఖ అధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో ఇళ్లకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించినట్లు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నవీన్‌రాథోడ్ తెలిపారు. సోమవారం విద్యుత్ సిబ్బంది 51 ఇళ్లకు మీటర్లను పెట్టడంతో గిరిజనుల సమస్య తీరిందన్నారు.

గోవింద్ మరణం పార్టీకి తీరని లోటు

సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని

సుజాతనగర్, జూలై 8: వేపలగడ్డ గ్రామ నివాసి, సీపీఎం సానుభూతిపరుడు బచ్చలకూర గోవింద్ (45) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృత దేహంపై పుష్పగుచ్చం ఉంచి సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని అయిలయ్య ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీపీఎం అంటే ఎనలేని అభిమానం కలిగిన వ్యక్తి ఇలా మృతి చెందడం బాధాకరం అని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్, నర్రా శివరామకృష్ణ, కొండె కృష్ణ, బచ్చలకూర శ్రీను, నల్లగోపు పుల్లయ్య, ఊడుగుల శ్రీకాంత్, శ్రీధర్‌రాజు, గంగయ్య, చిలకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలకు తహసీల్దార్ వితరణ

మణుగూరు, జూలై 8: మణుగూరులోని ముత్యాలమ్మనగర్‌లో గల సత్యసాయి ప్రత్యేక అవసకాలు కలిగిన పిల్లల పాఠశాలకు సోమవారం మణుగూరు తహశీల్దార్ రాఘవరెడ్డి సామాగ్రిని అందజేశారు. సత్యసాయి పాఠశాలలకు బీరువా, కూలర్, పుస్తకాలు, పెన్నులు పప్పు, చింతపండు, నిత్యసర సరుకులు, 50 కేజీల బియ్యాన్ని అందించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: డీఎస్పీ

పాల్వంచ, జూలై 8: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా విద్యార్థినులకు నేటి సమాజంలో ఆ అవగాహన ఎంతగానో ఉపయోగపడుతుందని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం పాల్వంచ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ బాలికల కళాశాలలో సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చట్టాలలో మార్పులు చోటు చేసుకున్నాయని, వాటికి అనుగుణంగా వాటికి లోబడి మనందరం ముందుకు సాగాలన్నారు. చదువుకుంటున్న బాలికలు వారు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవడమే కాక వారి తల్లిదండ్రులకు, స్నేహితులకు, నిరక్షరాస్యులకు అవగాహన కల్పించే బాధ్యతను స్వీకరించాలన్నారు. అదే విధంగా ఈ మధ్య కాలంలో యువత, గృహిణులు, నిరుద్యోగులు ఎక్కువగా సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని, తద్వారా తాము దాచుకున్న, సంపాదించిన డబ్బును పోగొట్టుకుని మోసపోతున్నారని,అందువలన గుర్తు తెలియని వ్యక్తుల మొబైల్ నెంబర్ల నుంచి వచ్చే ఏ రకమైన మెసేజ్ లకు, మెయిల్‌లకు, లింక్‌లకు స్పందించవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ టౌన్ ఎస్ఐ బానాల రాము, అడిషనల్ ఎస్ఐ స్వప్న, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులను చెల్లించాలి

జూలూరుపాడు, జూలై 8: మండలంలోని గుండెపుడి పంచాయతీలో కూలీలు ఉపాధి పనులు చేపట్టి నెలలు గడుస్తున్న బిలుల్లలు చెల్లించకపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ అన్నారు. సోమవారం గుండెపుడిలో ఆ పార్టీ గ్రామశాఖ సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందించి తక్షణమే వారికి బిల్లులను చెల్లించాలని కోరారు. వర్షాకాలం కావటంతో గ్రామాలల్లో పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాణోత్ మధు, వలమల్ల చందర్‌రావు, కనకరత్నం, సీతారాములు, సురేష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలం నిలిపివేయాలి

మణుగూరు, జూలై 8: సింగరేణిలోని బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం ద్వారా ప్రవేటు వ్యక్తులకు అప్పగించాలని ప్రయత్నాలు సాగించడం ఏ మాత్రం సరికాదని, సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలంను నిలిపివేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం జీఎం కార్యాలయం వద్ద ఇదే విషయంపై రిలే దీక్షలు చేస్తున్న ఏఐటియూసీ నాయకులను కలుసుకుని ఏఐటియూసీ దశల వారి పోరాట కార్యక్రమాలకు సీపీఐ తరఫున సంపూర్ణ మద్దతును తెలిపారు. మైన్స్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యూలేటరీ చట్టం (ఎంఎండీఆర్) తీసుచొచ్చి బొగ్గుగనుల ప్రవేటీకరణకు ఆద్యం పోశారన్నారు. అయితే దీనికి వ్యతిరేకంగా పోరాటాలు సాగటంలో వేసే వేలం పాట కార్యక్రమాలను నిలిపివేశారన్నారు. మరలా కేంద్రం వేలానికి దిగటం సమంజసం కాదన్నారు. దీన్ని వ్యతిరేకంగా ఏఐటియూసీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతుందన్నారు. సింగరేణి కాపాడుకునేందుకు జరుగుతున్న ఈ ఆందోళన కార్యక్రమాల్లో అన్ని యూనియన్లు,పార్టీలు, వర్గాల ప్రజలు మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోందె కుటుంబరావు, ఎస్‌కే సర్వర్, తోట రమేష్, కొత్తపల్లి సీతారాములు, ఆదర్ల రాములు, మాజీ కార్మికులు ఎండి ఉమర్, రంగు ఆంజనేయులు పాల్గొన్నారు.